

బూరుగుపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులు

# మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులకు అస్వస్థత

- గంగాధర మండలం బూరుగుపల్లి జడ్పీ పాఠశాలలో ఘటన
- కొత్త బియ్యం సరిగా లేకనేనని చెప్పిన హెచ్ఎం

గంగాధర, నవంబర్ 22 : బూరుగుపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత ముగ్గురు విద్యార్థులు కడుపునొప్పి వస్తోందని చెప్పి వాంతులు చేసుకున్నారు. తర్వాత మరికొంత మంది విద్యార్థులు కడుపునొప్పితో ఇబ్బంది పడ్డారు. దీంతో ఉపాధ్యాయులు స్థానిక ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాలకు వచ్చి చికిత్స అందజేశారు. పాఠశాలకు వచ్చిన కొత్త బియ్యం బాగా లేవని, సరిగా ఉడకపోవడం వల్లే విద్యార్థులు ఇబ్బంది పడినట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ తెలిపారు. కాగా, విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని ఉపాధ్యాయులు తెలుపకపోవడం.. సాయంత్రం తెలిసిన తర్వాత పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు కడుపునొప్పితో వాంతులు చేసుకుంటే ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. గురువారం కూడా భోజనం బాగా లేదని పిల్లలు చెబితే ఇంటి నుంచి టిఫిన్ తీసుకువెళ్లాలని పిల్లలకు చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు. కాగా, శనివారం నుంచి పిల్లలు ఇంటి నుంచే టిఫిన్ తెచ్చుకుంటారని, ఇలాంటి భోజనం పెట్టి తమ పిల్లలను ఇబ్బందులు పెట్టవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. కొత్త బియ్యంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని పై అధికారులు దృష్టికి తీసుకువెళ్లామని అధికారుల సహకారంతో సమస్యను పరిష్కరిస్తామని ఎంఈవో ప్రభాకర్‌రావు తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. విద్యార్థుల ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు.



జిల్లా విద్యాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న సీఆర్పీలు

## పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించండి

పెద్దపల్లి రూరల్, నవంబర్ 22: జిల్లా విద్యా శాఖలో పనిచేస్తున్న తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఆర్పీల సంఘం ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు జిల్లా విద్యాశాఖ అధికారికి పలు డిమాండ్‌లతో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జాక్ ప్రెసిడెంట్ తిప్పని తిరుపతి, సీఆర్పీ సంఘం అధ్యక్షులు కుంభాల సుధాకర్, ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, సంపత్, రాజ్‌కుమార్, సతీష్, శ్రీకాంత్, రమేశ్ పాల్గొన్నారు.

## ఓటు నమోదుకు మరో అవకాశం

కలెక్టరేట్, నవంబర్ 22 : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం 2025లో భాగంగా ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఈనెల 28 వరకు తుది గడువు ఉండగా, 23, 24 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. నేడు, రేపు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండనున్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారంతా ఫారం 6లో ఓటు నమోదుకు ఆన్‌లైన్‌లో కానీ, ఆఫ్‌లైన్‌లో కానీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అలాగే ఇప్పటికే ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు తెలిపేందుకు ఫారం 7, సవరణలు, నివాస గృహాల మార్పు, కొత్త ఫొటో గుర్తింపు కార్డు, దివ్యాంగులుగా గుర్తించేందుకు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరుగా తుదిజాబితాలో తమ పేర్లు కనిపించాలంటే ఈనెల 28లోగా నమోదు చేసుకోవాల్సిందేనని కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ నరేందర్ శుక్రవారం పకటనలో స్పష్టం చేశారు.

## రోడ్డున పడేయడమేనా అభివృద్ధా?

కోల్‌సిటీ, నవంబర్ 22 : 'మీది ప్రజా పాలన కాదు.. అరాచక పాలన.. ఇంట్ల ఉన్నోళ్లను బయటకు దొబ్బడమే అభివృద్ధా?' అంటూ గోదావరిఖనిలో పలువురు మహిళలు కాంగ్రెస్ కార్పొరేటర్‌ను బాహాటంగా నిలదీశారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో కొద్ది రోజులుగా రోడ్ల వెడల్పు, అభివృద్ధి పేరుతో కూల్చివేతల పర్వం కొనసాగుతున్న విషయం విధితమే. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్‌కు చెందిన ఓ కార్పొరేటర్ తన అనుచరులతో కలిసి వ్యాపారులను పలుకరిస్తూ వస్తుండగా గాంధీనగర్ వద్ద చుక్కెదురైంది. ఇండ్ల కూల్చివేతపై మహిళలు ఆగ్రహోదగ్రులయ్యారు. సదరు కార్పొరేటర్‌ను బహిరంగంగా నిలదీశారు. ఉన్నపలంగా ఇండ్లు కూల్చివేస్తే తాము ఎక్కడికి పోవాలంటూ ప్రశ్నించారు. మెడవట్టి బయటకు తీసుకవచ్చి బలవంతంగా కూల్చి ఏం సాధిస్తున్నారని మండిపడ్డారు. దీంతో అక్కడ జనం భారీగా గుమిగూడారు. ఊరు మొత్తం అభివృద్ధి చేయడమే రామగుండం ఎమ్మెల్యే ఉద్దేశమని చెప్పడంతో మహిళల ఆగ్రహం మరింత కట్టలు తెంచుకున్నది. అర్ధంతరంగా ఇంట్లో ఉన్న వాళ్లను రోడ్డున పడేయడమే మీ అభివృద్ధా? అంటూ ప్రశ్నించారు. దీంతో సదరు కార్పొరేటర్ సమాధానం చెప్పలేక నెమ్మదిగా అక్కడి నుంచి జారుకున్నారు. ఈ ఘటనను స్థానికులు తమ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో రామగుండంలో వైరల్‌గా మారింది.

సర్కార్ మాటలు.. నీటి మూటలు

# గురుకులంపై ఏదీ పర్యవేక్షణ?

- ఘటనలు జరిగినప్పుడే హడావుడి.. ఆ తర్వాత షరామామూలే
- కార్యరూపం దాల్చని డిప్యూటీ సీఎం ఆదేశాలు
- పాఠశాలలవైపు రెండునెలలుగా తొంగిచూడని ప్రజాప్రతినిధులు
- అదేదారిలో ఉన్నతాధికారులు • వెంటాడుతున్న సమస్యలు
- ఇబ్బందుల్లో విద్యార్థులు



ఆగస్టు 13న పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

బడుగు, బలహీనవర్గాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన గురుకులాలపై పర్యవేక్షణ కరువవుతున్నది. ఏడాది క్రితం వరకు సాఫీగా నడిచినా ఆ పాఠశాలల్లో.. ఇప్పుడు అంతా అస్తవ్యస్తంగా మారుతున్నది. పదకొండు నెలల పాలనలో గాడితప్పినట్టు తెలుస్తుండగా, తరచూ ఏదో ఒక ఘటన వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తున్నది. విద్యార్థుల మరణాలు, అస్వస్థత లాంటి ఘటనలు జరిగినప్పుడే హడావుడి చేస్తున్నా ఆ తర్వాత షరామామూలే అవుతున్నది. మూడు నెలల క్రితం పెద్దాపూర్ గురుకులంలో ఇద్దరు పిల్లలు చనిపోయినప్పుడు డిప్యూటీ సీఎం పరిశీలించి, గురుకులాల ప్రక్షాళనకు ఆదేశాలిచ్చినా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాఠశాలలను సందర్శించి, బసచేయాలని ఉత్తర్వులు ఇచ్చినా అవీ అమలు కాలేదు. ఫలితంగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు తయారు కాగా, సమస్యలు పరిష్కారం కాక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. చాలాచోట్ల ప్రమాదపుటంచున పిల్లల చదువులు సాగిస్తున్నట్టు తెలుస్తుండగా, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

### ఇద్దరు పిల్లలు బలి



గణాధిత్య (ఫైల్)



అనిరుధ్ (ఫైల్)

మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకులంలో నెల వ్యవధిలోనే ఇద్దరి ప్రాణాలు పోయాయి. జూలై 26న ఎనిమిదో తరగతి విద్యార్థి రాజారపు గణాధిత్య(13) మృతి చెందగా, అస్వస్థతకు గురైన మరో ఇద్దరు విద్యార్థులు చికిత్స తర్వాత కోలుకున్నారు. ఆగస్టు 9న 6వ తరగతి విద్యార్థి ఎడ్మల అనిరుధ్(11)మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలతో బయటపడ్డారు. సెప్టెంబర్ 11న సుల్తానాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీలో ఆరో తరగతి విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. వెంటనే కరీంనగర్ దవాఖానకు తరలించి చికిత్స అందించడంతో కోలుకున్నాడు.

జగిత్యాల, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు జగిత్యాల జిల్లాలోనే కాదు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యంత ఘనమైన చరిత్ర కలిగి ఉంది. 1983లో దీనిని ఏర్పాటు చేయగా, కాలగమనంలో జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ అయింది. ప్రస్తుతం పెద్దాపూర్ గురుకులంలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యాబోధన కొనసాగుతుండగా, 40 ఏండ్ల కాలంలో వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దింది. ఎంతో మంది దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. అలాంటి గురుకులంలో ఈ యేడాది జూలై, ఆగస్టు నెలల్లో ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం, మరో నలుగురు చావు అంచులదాకా వెళ్లడం కలకలం రేపింది. ఇద్దరు విద్యార్థుల మృతికి కారణాలు ఏంటో ఇంత వరకు ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించ లేకపోయింది. కానీ, పర్యవేక్షణాలోపం, వసతుల లేమే అందుకు కారణమని తెలుస్తుండగా, అప్పుడు పాఠశాలకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, గురుకుల పాఠశాలలను ప్రక్షాళన చేయబోతున్నామని ప్రకటించారు. అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. అయితే, ఆయన ఆదేశాలు జారీ చేసి రెండు నెలలు గడిచినా, ఇంత వరకు అవి కార్యారూపం దాల్చక పోవడం, ప్రజా ప్రతినిధులు, అధికారులు వాటిని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

### పర్యవేక్షణ కరువు

గురుకులాల నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందా? అంటే అవుననే సమాధానమే వస్తున్నది. సాక్షాత్తూ డిప్యూటీ సీఎం ఆదేశాలు ఇచ్చినా కార్యరూపం దాల్చడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేక అంతా అస్తవ్యస్తంగా మారుతున్నది. వసతుల లేమి, అపరిశుభ్ర వాతావరణంలో కొట్టుమిట్టాడుతుండగా, ఈ పరిస్థితుల్లోనే ప్రమాదాలు జరుగుతున్నట్టు తెలుస్తున్నది. అందుకు చాలా ఉదాహరణలు కనిపిస్తున్నాయి. చాలాచోట్ల పాఠశాలల ఆవరణలో పిచ్చి చెట్లు మొలవడం, సమీపంలో చెత్తాచెదారం ఉండడం లాంటి కారణాలతో పాములు తిరుగుతున్నాయి. పెద్దాపూర్ గురుకులంలో ఇద్దరి మృతికి కారణాలు ఇప్పటి వరకు తెలియకున్నా.. సుల్తానాబాద్‌లో మాత్రం పాముకాటుతోనే విద్యార్థి దవాఖాన పాలయ్యాడు. చాలాచోట్ల పాఠశాలల ఆవరణల్లోకి పాములు వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. అయినా, పట్టించుకునే వారు లేరు. పెద్దాపూర్ గురుకులంలో ఇద్దరు చనిపోయిన తర్వాత గానీ, ప్రజాప్రతినిధులు, అధికారులు కదలలేదు. పాత భవనాలను నేలమట్టం చేసి, కొత్త భవనంలోకి పిల్లలను పంపించారు. అప్పుడు ఆవరణ అంతా ఎక్స్‌కవేటర్లతో చదును చేశారు. ఆ సమయంలో పాములు బయటికి రావడంతో చంపేశారు. ఇలాంటి పరిస్థితే చాలాచోట్ల ఉన్నది.

### అమలుకు నోచని భట్టి ఆదేశాలు

పెద్దాపూర్ గురుకులంలో ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన నేపథ్యంలో ఆగస్టు 13న మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిశీలించారు. దాదాపు ఐదు గంటల పాటు పాఠశాలలో కలియతిరిగారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదేశాలు ఇచ్చారు. కానీ, అందులో పెద్దాపూర్ విద్యార్థులకు బెడ్స్ తప్ప మరే హామీ నెరవేరలేదు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల విద్యార్థులకు బెడ్స్, బెడ్ షీట్స్‌ను అందిస్తామని చెప్పారే తప్ప ఇంత వరకు ఇవ్వలేదు. ఇక ప్రహరీల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. విద్యార్థులకు హెల్త్‌కార్డులు జారీ కాలేదు. ప్రతి నెలా రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహించడం లేదు. హెల్త్‌కార్డుల్లో విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నమోదు ప్రక్రియపై ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. ఇక ప్రధానంగా మంత్రులు, విప్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గురుకుల పాఠశాలలకు వెళ్లి విద్యార్థులతో భోజనం చేసి, సమీక్ష సమావేశం నిర్వహించి, బస చేసిన దాఖలాలు లేవు. అన్నింటికంటే అధ్వానమైన విషయం ప్రభుత్వం కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు విధిగా నెలకో గురుకులాన్ని సందర్శించి, బస చేయాలని ఇచ్చిన ఉత్తర్వులు సైతం అమలు కావడం లేదు. రెండు నెలల కాలంలో ఏ ఒక్క రోజు, ఏ ఒక్క గురుకులంలో బస చేసిన దాఖలాలు లేవు. ఇలా ఆనాడు డిప్యూటీ సీఎం ఎన్నో హామీలు ఇచ్చినా అమలుకు మాత్రం నోచడం లేదు. గురుకుల పాఠశాలల వ్యవహారంలో ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు గుప్పిస్తున్నా ఆచరణలో మాత్రం అవన్నీ తేలిపోతున్నాయని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. గురుకులాల్లో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని, పిల్లలు ఇబ్బంది పడుతున్నారని వాపోతున్నారు. ప్రమాదపుటంచున పిల్లల చదువులు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బంది కూడా స్థానికంగా ఉండడం లేదని, ఏదైనా జరిగినప్పుడు పిల్లలు ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి ఉంటున్నదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

### రోడ్డెక్కిన లక్ష్మీపూర్ గురుకులం విద్యార్థులు

జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లోని బీసీ సంక్షేమ గురుకుల స్కూల్ విద్యార్థినులు ఈ నెల 16న రోడ్డెక్కారు. ప్రిన్సిపాల్ తమను వేధిస్తున్నదని, సెలవులకు ఇంటికి వెళ్లి ఆలస్యంగా వస్తే డబ్బులు వసూలు చేస్తున్నదని ఆరోపించారు. తమను చూడడానికి వచ్చిన తల్లిదండ్రులపైనా దురుసుగా ప్రవరిస్తున్నదని మండిపడ్డారు. వెంటనే ఆమెను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన అధికారులు ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. నిజానికి విద్యార్థులు చాలా రోజుల పాటు ఇబ్బందులు పడ్డారు. విసిగి వేసారి రోడ్డెక్కితేగాని సమస్య పరిష్కారం కాలేదు.

# ఆర్వోబీ పూర్తయ్యేదెన్నడు?

నత్తనడకన పెద్దపల్లి-కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు



కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు

- ఇంకా పూర్తికాని భూసేకరణ ప్రక్రియ.. స్లాబుల నిర్మాణం
- గంటలో నాలుగైదుసార్లు పడుతున్న రైల్వే గేటు
- జిల్లా ప్రజల నరకయాతన



పెద్దపల్లి శివారులో గేటు పడడంతో వేచి ఉన్న వాహనదారులు

**పెద్దపల్లి-కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి నత్తనడకన సాగుతున్నది. బీఆర్ఎస్ సర్కారు చొరవతో నిర్మాణానికి అడుగు పడినా.. ప్రభుత్వం మారడంతో పనుల్లో ఆలస్యం జరుగుతున్నది. వచ్చే మేలోగా పూర్తి చేయాల్సి ఉన్నా.. అప్పటి వరకు పూర్తవడం అనుమానంగానే కనిపిస్తున్నది. నిత్యం ఈ రైల్వేలైన్‌లో వందలాది రైళ్లు నడుస్తుండగా, గంటలో నాలుగైదు సార్లు గేటు పడి నియోజకవర్గ ప్రజలు నరకం చూస్తున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉండగా, వంతెన త్వరగా పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.**

### రైలు వస్తుందంటేనే భయం



మా తాతలు తండ్రుల కాలం నుంచి రైల్వే బ్రిడ్జి లేక అరిగోస పడుతున్నం. మేం ప్రతిరోజూ పెద్దపల్లి-కూనారం రోడ్డుపై ప్రయాణిస్తుంటం. అయితే గేటు పడినప్పుడల్లా గంటల తరబడి ఇక్కడే ఉంటున్నం. రైలు కూత వినిపించిందంటే చాలు భయం వేస్తున్నది. ఎక్కడ గేటు పడుతుందోనని భయంతో అటూ.. ఇటూ దాటుతున్నం. త్వరగా రైల్వే బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి.

**- పూసాల రమణాచారి, వెన్నంపల్లి (కాల్వశ్రీరాంపూర్ మండలం)**

పెద్దపల్లి, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి రైల్వే జంక్షన్‌కు రైళ్ల తాకిడి అంతా ఇంతా కాదు. ఢిల్లీ-గ్యాంగ్‌టక్ రూట్ కావడంతో నిత్యం వందలాది రైళ్ల రాకపోకలు సాగుతాయి. పెద్ద ఎత్తున ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్‌ఫాస్ట్, గూడ్స్ రైళ్లు నడుస్తుంటాయి. ఈ రైల్వేమార్గం పెద్దపల్లి శివారును ఆనుకొని ఉంటుంది. పెద్దపల్లి నుంచి ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, జమ్మికుంట, వరంగల్ దాకా ఇదే ప్రధాన రహదారిగా ఉంది. అయితే పెద్దపల్లి శివారులో ఉన్న రైల్వే లైన్‌పై ప్రతి 15 నిమిషాలకోసారి గేటు పడుతుండగా, జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటలో నాలుగైసార్లు గేటు పడుతుండడంతో నరకం చూస్తున్నారు. కొన్నిసందర్భాల్లో అత్యవసర వైద్యం అవసరమైనవారు అక్కడికక్కడే ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. దీంతో ఈ ప్రాంత నాయకులు, ప్రజలు కలిసి పెద్దపల్లి-కూనారం ఆర్వోబీ కోసం కూనారం ఓవర్ బ్రిడ్జి సాధన సమితి పేరిట పోరాటాలు సైతం చేశారు. అయినా ప్రతి ఎన్నికల సమయంలో నాయకులు హామీ ఇచ్చి మరిచిపోవడమే తప్పా ఎవరూ పట్టించుకోలేదు. కానీ, గత బీఆర్ఎస్ సర్కారు ఈ సమస్యను పరిష్కరించేందుకు ముందుకొచ్చింది. కేంద్రం సహకారంతో ఆర్వోబీని మంజూరు చేసింది. రాష్ట్రం 60 శాతం, కేంద్రం 40 శాతం భాగస్వామ్యంతో నిర్మించాలని నిర్ణయించి, సంయుక్తంగా ₹119.5 కోట్ల నిధులను మంజూరు చేశాయి. 2022 అక్టోబర్ 10న నిర్మాణ పనులను అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహరెడ్డి ప్రారంభించగా, మొదట్లో ఈ పనులు వేగవంతంగా సాగాయి. అయితే తర్వాత ప్రభుత్వం మారడం, నిర్మాణంపై పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ప్రస్తుత పెద్దపల్లి ఎమ్మెలే పలుసార్లు పనులను పరిశీలించినా వేగవంతంగా సాగడం లేదు. ఇంకా భూసేకరణ పూర్తి కాలేదు. అదే విధంగా బ్రిడ్జి 46 స్లాబులకు కేవలం 20 స్లాబుల నిర్మాణం మాత్రమే పూర్తయ్యింది. అలాగే వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించాల్సి ఉన్నది. వచ్చే ఏడాది మేలోగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉన్నా, అనుమానంగానే ఉన్నది. పనులు నత్తనడకన సాగుతుండడంతో ఇప్పటికీ పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి, రైల్వే గేటు కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

### ఎప్పుడు పూర్తయితదో..



మాది జాఫర్‌ఖాన్‌పేట. మాకు ఏం కావాలన్నా పెద్దపల్లికి రావాల్సిందే. ఈ మార్గ మధ్యలో ఉన్న రైల్వేగేటు మా గ్రామాలకు తీరని శాపంగా మారింది. నేను స్కూలు, కాలేజీకి వెళ్లింది కూడా ఈ దారి నుంచే. చిన్నప్పటి నుంచి ఈ గేటుతో ఎన్నో బాధలు పడ్డం. నేనే కాదు మా చుట్టుపక్కల ఉన్న రాంపెల్లి, మారేడుగొండ, గుర్రాంపల్లి, వెన్నంపల్లి, మంగపేట, కూనారం, కాల్వశ్రీరాంపూర్ గ్రామాల ప్రజలు కూడా చాలా ఇబ్బందిపడుతున్నరు. ఈ వంతెన ఎప్పుడు పూర్తయితదో.. మా కష్టాలు ఎప్పుడు తీరుతాయో.

**-పనాస రమేశ్, జాఫర్‌ఖాన్‌పేట్ (కాల్వశ్రీరాంపూర్ మండలం)**



# యాసంగి ప్రణాళిక ఖరారు

- కరీంనగర్ జిల్లాలో 3.04 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- ఎప్పటిలాగే వరిదే అగ్రస్థానం
- స్వల్పంగా ఆరుతడి పంటలు పెంపు

**యాసంగి సీజన్ సాగుకు కరీంనగర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక ఖరారు చేశారు. ఈ సీజన్‌లో 3,04,655 ఎకరాల్లో పంటలు సాగు చేసే అవకాశముందని అంచనా వేశారు. అందులో ఎప్పటిలాగే వరిదే అగ్రస్థానంగా కాగా, ఆరుతడి పంటల సాగును గతానికంటే స్వల్పంగా పెంచారు.**

కరీంనగర్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : జిల్లా రైతులు ఓవైపు వానకాలం పంట ఉత్పత్తులను విక్రయిస్తూనే.. మరోవైపు యాసంగి సాగుకు సిద్ధమయ్యారు. అక్టోబర్‌లోనే యాసంగి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఇటు పంటలు వేసేందుకు ఉపక్రమిస్తున్నారు. ఒక పక్క ఆరుతడి పంటలు సాగు చేసుకుంటూ వరి నార్లు పోసుకుంటున్నారు. మక్క, పల్లి, తదితర ఆరుతడి పంటలు కూడా సాగవుతున్నాయి. ఈసారి బావులు, బోర్ల కింద పెద్ద మొత్తంలో వరి సాగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్టుల్లోనూ అనుకూలంగా నీరు ఉన్నందున ఆయకట్టు, చెరువుల పారకం ప్రాంతాల్లో కూడా వరి సాగు విస్తరించే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ఎక్కువగా వరికే మొగ్గు చూపుతున్నారు. అక్కడక్కడా దుక్కులు దున్నుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేశారు. మొత్తం 3,04,655 ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని, అందులో 2.65 లక్షల ఎకరాల్లో వరి వేస్తారని అంచనా వేశారు. ఆరుతడి పంటలకు ఈసారి కాస్త ప్రాధాన్యత పెంచారు. పెసర 80, మినుము 5, జొన్న 50, శనగలు 50, అనుములు 50, పల్లి 500, నువ్వులు 60, పొద్దుతిరుగుడు 380, కందులు 10 ఎకరాల్లో కలిపి 1,205 ఎకరాల్లో సాగు కావచ్చని చెప్పారు. అలాగే, యాసంగి పత్తి 20 ఎకరాలకు ప్రణాళిక వేయగా పొగాకు 500 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. ఇక ఇతర పంటలను 1,200 ఎకరాల్లో సాగవుతుందని పేర్కొన్నారు.

## సిగరెట్ తాగొద్దన్నందుకు..

ఉరేసుకొని పదోతరగతి విద్యార్థి ఆత్మహత్య

కోనరావుపేట, నవంబర్ 22 : సిగరెట్ తాగొద్దని తల్లిదండ్రులు మందలించినందుకు ఓ పదో తరగతి విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుద్దాలకు చెందిన అలువాల శ్రీనివాస్-అంజవ్వ దంపతులకు ఇద్దరు కొడుకులు కాగా, చిన్న కొడుకు వెంకటేశ్(16) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కొన్ని రోజులుగా వెంకటేశ్ సిగరెట్ తాగుతున్నాడని తల్లిదండ్రులు మందలించడంతో కొన్ని రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించి చికిత్స అందించారు. అప్పటి నుంచి వెంకటేశ్ తల్లిదండ్రులు, స్నేహితులతో సరిగా మాట్లాడకుండా దిగాలుగా ఉంటున్నాడు. అదే విషయం మనసులో పెట్టుకొని గురువారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిరిసిల్ల దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందాడు. తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.